# చివరిమాట

ఒక్కసారిగా దగ్గు పొరవచ్చి శివరావుని ముంచెత్తింది. మళ్లీ కొద్ది సేపట్లోనే కోలుకున్నాడు. మనిషంతా పాలిపోయి తెల్లగా వున్నాడు. గుండెమీది ఎముకలు పైకి కనపడుతున్నాయి. కళ్ళుకూడా చాలా లోతుగా అయ్యాయి.

శివరావు దగ్గడం ఐపోగానే కాండ్రించి మంచంపక్కగావున్న మూకుడులో వుమ్మాడు. సుశీల ఖంగారుతో అతని వక్షాన్ని నిమురుతోంది.

పక్కగా ఒక స్టూల్‌మీద కొన్ని మందుసీసాలు, ఔన్సు గ్లాసు, దీపంబుడ్డి వున్నాయి. సుశీల తెల్లని చీరకట్టుకునివుంది. జుట్టుపోషణ లేక చిందరవందరగావుంది. వయస్సు పాతికేళ్ళలోపులో వుంటుంది. ముఖంలో ఒక విధమైన శాంతిస్వభావం, సహనశక్తి గోచరిస్తోంది.

"ఏం ? ఎట్లావుంది ?"

"అంత... బాధగా... లేదులే."

ఆయాసంతోనే సమాధానం ఇచ్చాడు. శివరావుకి మొదట్నించీ ఆరోగ్యం అంత మంచిదికాదు. ఎప్పుడూ పీలగావుండేవాడు. అందులో రాజకీయాల్లో ప్రవేశించాక రెండేళ్ళ జైలు జీవితం అతన్ని కుంగదీసింది. క్షయ ప్రవేశించింది.

"సుశీ... ఒకసారి ఇటురా"

మెల్లిగా పిల్చాడు. వెనకాలనుంచి వక్షం నిమురుతున్న సుశీల ఇవతల పక్కకి వొచ్చి. అతని పక్కని కూచుని నుదురు మీద చెయ్యి వేసింది.

కిందకిపడే ముంగురుల్ని చేత్తో మృదువుగా దువ్వుతున్నాడు శివరావు. ఆలోచనగా అతనివైపు చూస్తోంది సుశీల.

ఒక నిముషం వూరుకున్నాడు. శివరావు ఆమెని చూస్తున్నకొద్దీ అతనిలో ఏవో భావాలు కలిగాయి. కళ్ళు నీళ్ళతో నిండాయి.

ఆమె వొడిలో తలపెట్టుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టాడు. ఈ దృశ్యం సుశీల

ధైర్యాన్ని కరిగించి ఆమె కళ్లనికూడా తడిపర్చకపోలేదు. కాని ధైర్యం చెప్పాల్సినభారం ఆమె మీదే వుండడంవల్ల లోపలే దిగమింగుకుంటోంది.

"ఛా! అదేమిటి? యాడవకండీ. అదేతగ్గుతుంది."

ఓదారుస్తోంది. నెమ్మదిగా శివరావుకూడా దు:ఖాన్ని ఆపుకున్నాడు.

"సుశీ! నన్ను క్షమించవ్!!"

ఆమె చేతులు పట్టుకుని బతిమాలుతున్నాడు. సుశీల బేలగా చూస్తోంది. అతని ఈ వేళటి ధోరణిన్ని. లోపల ఏదో భయపడుతోంది.

"ఏమిటండీ, అట్లా మాట్లాడుతారు?"

చీరకొంగుతో అతని కళ్ళని తుడుస్తోంది.

"నీతో ఈ వేళ చాలా సంగతులు మాట్లాడాలని వుంది."

ఈ మాట అన్నాక ఒక దగ్గు పొరవొచ్చి మళ్ళీ ఐదు నిమిషాల్ని మింగింది. మళ్లా అందుకున్నాడు.

"నేను నిన్ను పెళ్ళాడ్డంలో నీకు తీరని అన్యాయం చేశాను" సుశీల నోరు ముయ్య పోయింది నాలిక కొరుక్కుంటా, కాని అది ధోరణిని ఆపలేదు.

"భయం లేదులే. నా మనసు విప్పి చెప్పనా. నేను అట్లా ఎందుకన్నానంటే చిన్నప్పట్నించీ అంత ఆరోగ్యంగా లేనినేను నిన్ను పెళ్లాడి, నీ జీవితాన్ని దు:ఖంతో నింపాను.

"అసలు చాలారోజులవరకు పెళ్ళిని నిరాకరించే బతికాను. చదువుపూర్తయ్యే రోజుల్లో ఇంటిదగ్గరవొత్తిడి ఎక్కువైంది. కాని అప్పటికీ లొంగదల్చుకోలేదు. అట్లా చెయ్యడానికి ఇంట్లో చిన్న తిరుగుబాటు తేవాలి.

"చాలారోజులు ఆలోచించాను. బాల్యంలో వివాహమాడిన గాంధీ మొదలైన వాళ్ల జీవితాలు పెళ్ళి ఆశయాన్ని సాధించడానికి ఆటంకకారి కాలేదనుకున్నాను. అందుకే అంగీకరించింది.

"కాని నిన్ను గురించి ఎంత ఆలోచించానో?... నీ కెప్పుడూ నేను చెప్పలేదు, ముఖస్తుతి అనుకుంటావని. ఇంత అనుకూలవతి అయిన భార్య దొరికినందుకు ఎంత ఆనందించానో."

అతని కళ్లు ఆనందబాష్పాలతో నిండాయి.

"అవును కాని ఇప్పుడు నిన్నుగురించే అంతగా ఆలోచిస్తున్నాను. బాధపడుతున్నాను. నన్ను తిట్టుకుంటున్నాను.

"నేను చచ్చిపోవడం నిజం."

"రామ ఎంతమాట" అంటూ నోరు మూసింది సుశీల. ఆ మాట అధికార స్వరంతోనే అంది. చెయ్యి తొలిగించి మళ్లా సాగనిచ్చాడు;

"ప్రపంచంలో హిందూ స్త్రీగా పుట్టడంకంటె దురదృష్టం వేరేలేదు. సహనశక్తితో పోయబడిన విగ్రహాలు.

"చివరి మాటవిను. నేను అట్టే రోజులు బతకనులే. కాని నేను చచ్చిపోయాక... ..." ఇక్కడ ఆగి...

శ్లేష్మాన్ని మూకుడులో వుమ్మేశాడు.

"మధ్యతరగతి స్త్రీలది ఎంత అవస్థో? పై తరగతివాళ్ళు, లోతరగతి వాళ్ళూ కూడా మారు మనువులు చేసుకుంటారు. తక్కువ తరగతివాళ్ళే ఎక్కువ నాగరీకులేమో?

"నేను చచ్చిపోయాక... మళ్లీ నాకు నచ్చినతన్ని పెళ్లిచేసుకుంటానని ప్రతిజ్ఞ చెయ్యాలి. అంతవరకూ నా ఆత్మకి శాంతివుండదని మరవకు. ఇన్నాళ్ల నా స్నేహం, సహచర్యం, నేను నేర్పిన సంస్కార భావాలు వృధాకావనుకుంటాను."

గొంతులో పటుత్వం క్షీణించి జీరొస్తోంది. సుశీల అంతా కొయ్యబారి వింటోంది. కాని చివరిమాటలు వింటున్నప్పుడు చేతుల్లో ముఖం దాచుకుని యాడవసాగింది వెక్కి వెక్కి .

శివరావుకు మళ్ళీ పెద్ద దగ్గుపొర ఆవరించింది. అవే అంతిమ ఘడియలు. పదిహేను నిమిషాలు యమయాతన పెట్టింది. ఆమె వైపు ప్రేమగా చూస్తూనే ప్రాణాల్ని వొదిలాడు.

అతనిమీద పడి హృదయం పగిలేలా యాడవసాగింది సుశీల.

పక్కింటివాళ్ళు నిద్రలోంచి లేచొస్తూ, "ఏమిటి! ఏం జరిగిందేమిటి?" అంటున్నారు. సుశీల యాడవడం లోనే మునిగుంది కొంత సేపటిదాకా.

*01. 09. 1946–ఆనందవాణి వారపత్రిక*